సాక్షి
నిజామాబాద్
శనివారం । 30 । నవంబర్ । 2024



ప్రభుత్వ నిధులతో..
మాక్లూర్ మండలం మాణిక్‌బండార్ సమీపంలోని వెంచర్‌కు వెళ్లడానికి ప్రభుత్వ నిధులతో వంతెన నిర్మించారు.
- 8లో ▸



క్రీడల్లో రాణించాలి
విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.6 /9.7
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎరువుల నిల్వల తనిఖీ



వేల్పూర్: మండలంలోని వేల్పూర్, రామన్నపేట్, పచ్చలనడ్కుడ, అంక్సాపూర్ సొసైటీలను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ శుక్రవారం తనిఖీ చేశారు. సొసైటీలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువులను పీవోస్ మిషన్‌ల ద్వారానే విక్రయించాలని ఆదేశించారు. ఎరువుల స్టాకు రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రోజువారి ఎరువల నిల్వలను, ధరలను బోర్డుపై రైతులకు తెలిసే విధంగా ఉంచాలన్నారు. సరిపడ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఏవో శృతి, ఏఈవోలు సాయి, రామరాజు, సొసైటీల కార్యదర్శులు ఉన్నారు.


కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం 340 మంది గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 607 మంది విద్యార్థులకు 548 మంది హాజరు కాగా 59 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 6,724 మంది విద్యార్థులకు గానూ 6,443 మంది హాజరు కాగా 281 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

నేడు కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు

ఖలీల్‌వాడి : శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లు శనివారం విధుల్లో చేరనున్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కానిస్టేబుళ్లకు పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. సీపీ ఆఫీస్ సిబ్బంది పోలీస్ స్టేషన్ల కేటాయింపునకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆర్‌ఎం జానీరెడ్డికి వీడ్కోలు



ఖలీల్ వాడి: నిజామాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి నల్గొండకు బదిలీ కాగా శుక్రవారం సిబ్బంది వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. నిజామాబాద్‌కు ఆర్‌ఎంగా సంగారెడ్డి నుంచి జ్యోత్స్న రానున్నారు.

చేతులు దులుపుకుంటే ఎలా?

- అధికారులు ఫైల్ పంపిన తర్వాత కలెక్టర్ ద్వారా ఫాలోఅప్ చేయాలి
- మంత్రినైన నేను జిల్లాకు వచ్చి అడిగితే పూర్తి వివరాలు చెప్పకపోతే ఎలా?
- కలెక్టరేట్‌లో సమీక్షలో రోడ్లు, భవనాల శాఖ అధికారులపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసహనం
- యుద్ధప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు
- జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



జిల్లా సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, లక్ష్మీకాంతారావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తదితరులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రోడ్లు, భవనాల శాఖ మంత్రినైన నేను జిల్లాకు వచ్చి రోడ్ల పరిస్థితిపై అడిగితే పూర్తి వివరాలు చెప్పకపోతే ఎలా? అధికారులు నోట్‌ఫైల్స్ పంపి చేతులు దులుపుకున్నామంటే ఎలా? జిల్లా కలెక్టర్ ద్వారా ఎప్పటి కప్పుడు ఫాలో చేయకపోతే ఎలా? గత ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని ఆగమాగం చేసినప్పటికీ తమ ప్రభుత్వం కిందమీద పడి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇలాంటి నేపథ్యంలో అధికారులు కచ్చితత్వంతో వ్యవహరించకపోతే ఎలా? ప్రపంచంలో రోడ్డు ప్రమాదాల్లో భారతదేశం మొదటి స్థానంలో ఉంటే, దేశంలో తెలుగు రాష్ట్రాలు ప్రథమ స్థానంలో ఉన్నాయన్నారు. వీటిని తగ్గించాలంటే రోడ్లు పకడ్బందీగా వేసుకోవాల్సిందేనని, ఇందుకు అధికారులు పూర్తిగా సహకరించాలని శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

■ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతులతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం పలు అభివద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల నిర్మాణాలు, ఆర్‌వోబీ పనుల ప్రగతి, ధాన్యం సేకరణ, రైతులకు బిల్లుల చెల్లింపులు, మిషన్ భగీరథ నీటి సరఫరా అంశాలపై వివరాలు తెలుసుకున్న మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలకు రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ప్రజారవాణ వ్యవస్థకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. రోడ్లపై గుంతలు లేకుండా ఆధునిక సాంకేతిక పద్ధతులలో మరమ్మతులు చేపడుతుండడంతో చాలాకాలం పాటు రహదారులు మన్నికగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామన్నారు.

■ ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో తాగు నీరు, పారిశుధ్యంపై స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక దష్టిని కేంద్రీకరించాలని మంత్రి అన్నారు. మిషన్ భగీరథ కింద జిల్లాలో సుమారు రూ.3 వేల కోట్లు ఖర్చు చేశారని, ప్రతి నివాస ప్రాంతంలో ఇంటింటికి రక్షిత నీరు సరఫరా అయ్యేలా చూడాలని ఆదేశించారు. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

■ ఇందల్వాయి – ధీంగల్ రోడ్డును రెండ్రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అటవీ అనుమతుల పేరుతో పనులను పెండింగులో పెట్టడం సరికాదన్నారు. జిల్లాలో సుదీర్ఘ కాలం నుంచి కొనసాగుతున్న ఆర్వోబీ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్మూర్ – జగిత్యాల, జగిత్యాల నుంచి మంచిర్యాల రోడ్డు నిర్మాణంపై దష్టి సారించామన్నారు. మద్నూర్ – బోధన్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి వారం రోజుల్లో ప్రతిపాదనలు తనకు పంపించాలని, జాతీయ రహదారుల సంస్థ ద్వారా అనుమతులు తెప్పిస్తానన్నారు. రహదారులు అభివృద్ధి అయితే రోడ్డు ప్రమాదాలను చాలా వరకు నివారించగలుగుతామన్నారు. వార్షిక ప్రణాళికకు సంబంధించిన రోడ్ల పనులు తక్షణమే ప్రారంభించాలని, గడువు దాటితే మంజూరీలు వెనక్కి మళ్లిపోతాయన్నారు.

■ ధాన్యం సేకరణ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలో ఈ సీజన్‌లో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 4.86 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు పూర్తి చేశామన్నారు. రైతులకు రూ.736 కోట్ల బిల్లులు జమ చేశామన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ కింద జిల్లాలో రూ.73 కోట్లు చెల్లించామన్నారు. మిగితా బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా వెంటవెంటనే ట్యాబ్ ఎంట్రీలు జరిపిస్తున్నామన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సైతం సన్న బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు సన్న ధాన్యం సాగు చేసేలా అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. అందుకే సన్న వడ్లకు క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. రైతులకు యాసంగి సాగు పెట్టుబడులకు ఇబ్బందులు లేకుండా తక్షణమే బిల్లుల చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు.

■ సమీక్షకు ముందు ఇందల్వాయి మండలం నల్లవెల్లిలో రూ.22 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు, అదేవిధంగా రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న నల్లవెల్లి నుంచి మంగ్యానాయక్ తండా రోడ్డుకు, రూ.18 కోట్లతో చేపడుతున్న నల్లవెల్లి నుంచి గౌరారం రోడ్డుకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ధర్పల్లి మండలంలో రూ.8 కోట్లతో ధర్పల్లి నుంచి ఇందిరానగర్ విగ్రహం వరకు, నిజామాబాద్‌లో వినాయక్ నగర్ నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపనలు చేశారు. సమీక్షలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఎఫ్‌వో వికాస్ మీనా, సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ ప్రగతికి చిహ్నంగా నిలిచే రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దష్టిని కేంద్రీకరించాలని అధికారులకు మంత్రి కోమటిరెడ్డి హితవు పలికారు. స్థానికంగా సమస్యలు ఉంటే కలెక్టర్ సహకారంతో ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీసీ రోడ్లను బీటీ రోడ్లుగా, బీటీ రోడ్లను ట్రాఫిక్ రద్దీ ఉండే చోట డబుల్ రోడ్డుగా మార్చాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకే..

- సన్నవడ్లకు బోనస్ ఇచ్చే స్కీం ప్రవేశపెట్టాం
- ప్రతిఒక్కరూ సన్నబియ్యం అందిస్తే రీసైకిల్ దందా లేకుండా పోతుంది
- రీజినల్ రింగ్‌రోడ్ తెలంగాణకు సూపర్ గేమ్ చేంజర్
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రాష్ట్రంలోని పేదలు, అంగన్‌వాడీలు, వసతిగృహాలు, పాఠశాలల విద్యార్థులకు సన్నబియ్యం అందించాలనే లక్ష్యంతో మా ప్రభుత్వం సన్నధాన్యం సాగును ప్రోత్సహిస్తోందని, ఇందులో భాగంగానే సన్నబియ్యం సాగును ప్రోత్సహించేందుకు బోనస్ ఇస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సన్న ధాన్యం సాగును ప్రోత్సహించడం ద్వారా దళారుల రీసైకిల్ దందా సైతం లేకుండా పోతుందన్నారు. అయినప్పటికీ ప్రతిపక్షాలు పనికిరాని విమర్శలు చేస్తున్నాయన్నారు. మహబూబ్‌నగర్‌లో రైతుపండుగకు రైతులందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఇక పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో, పేదలకు ఇళ్లు కట్టించే విషయంలో ఏవిధంగా పనిచేసిందో అందరికీ తెలిసిందేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు ఇస్తున్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతూనే కొత్త పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక మాత్రం ఇచ్చిన హామీలు అమలు చేసే లక్ష్యంతో వెళుతున్నామన్నారు. మాది చేతల ప్రభుత్వమన్నారు. తెలంగాణ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇచ్చిందన్నారు. కానిస్టేబుల్ కిష్టయ్య, శ్రీకాంతాచారి లాంటి అనేకమంది అమరులు తెలంగాణ కోసం ప్రాణత్యాగాలు చేశారన్నారు. ఇంతమంది త్యాగాలతో తెలంగాణ వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో దీక్షా దివస్ ఎవరు చేసుకోవాలని పరోక్షంగా బీఆర్‌ఎస్ గురించి విమర్శలు చేశారు. సోనియాగాంధీ పుట్టిన రోజున అసలైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకు ముందు ధర్పల్లిలో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. కేసీఆర్ ఖమ్మం ఆస్పత్రిలో చేసింది దొంగ దీక్ష అన్నారు. ఆస్పత్రిలో జ్యూస్ తాగి దీక్ష అంటే ఎలా అన్నారు. ఆస్పత్రిలో దీక్ష చేస్తే డాక్టర్లు చావనిస్తారా అన్నారు. కేటీఆర్, హరీశ్ రావు మాత్రం కేసీఆర్ చావు నోట్లో తల పెట్టి తెలంగాణ తెచ్చారని చెప్పడమేమిటన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని, లేకుంటే తల నరుక్కుంటానని చెప్పి అధికారంలోకి వచ్చాక మాత్రం కేసీఆర్ కుటుంబ సభ్యులు లక్షల కోట్లు సంపాదించుకున్నారన్నారు. తాను మాత్రం తెలంగాణ వచ్చాకే మంత్రి పదవి తీసుకుంటానని చెప్పి ఉమ్మడి రాష్ట్రంలో మంత్రి పదవికి రాజీనామా చేశానన్నారు.

రీజినల్ రింగ్‌రోడ్‌కు ఫిబ్రవరిలో టెండర్లు

హైదరాబాద్ చుట్టూ నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్ తెలంగాణకు సూపర్ గేమ్ చేంజర్ కానుందని కోమటిరెడ్డి అన్నారు. ఈ రోడ్డుకు ఫిబ్రవరిలో టెండర్లు పిలువనున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి–భువనగిరి–చౌటుప్పల్ వరకు మొదటి దశ రోడ్డు ఉంటుందన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మెట్రో రైలు, కోకాపేట సెజ్, పీవీ ఫ్లైవర్‌తో నగరం అభివృద్ధి చెందిందన్నారు. గేమ్‌చేంజర్ అయిందన్నారు. ఇక రీజినల్ రింగ్‌రోడ్‌తో తెలంగాణకు సూపర్ గేమ్‌చేంజర్ కానుందన్నారు. ఇక రియల్ ఎస్టేట్ పడిపోయిందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో కొంతమేరకు రియల్‌ఎస్టేట్ స్లో కావడం సాధారణమన్నారు.

నోరు అదుపులో పెట్టుకోండి..

- అవాకులు.. చవాకులు పేలితే సహించబోము..
- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే నాలుక కోస్తామని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ గురించి జీవన్‌రెడ్డి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. ఖబడ్దార్ జీవన్‌రెడ్డీ అంటూ హెచ్చరించారు. జీవన్‌రెడ్డి తన స్థాయిని మరిచి అవాకులు, చవాకులు పేలితే ఆర్మూర్ నడిబొడ్డులో నాలుక కోస్తామన్నారు. ఇప్పటికైనా జీవన్‌రెడ్డి పద్ధతి మార్చుకోవాలన్నారు. గతంలోనూ ఇలాగే ప్రవర్తిస్తే ప్రజలు ఈడ్చి నేలకు కొట్టారని, ఈ విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఆర్మూర్ ప్రజలు జీవన్‌రెడ్డిని మూడోస్థానంలోకి పంపి చిత్తుచిత్తుగా ఓడించిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకవాదిగా వ్యవహరించిన జీవన్‌రెడ్డిని ప్రజలు ఈడ్చి నేలకు కొట్టినప్పటికీ సిగ్గు లేకుండా తన స్థాయిని మరిచి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే తరిమితరిమి కొట్టాల్సి ఉంటుందని మానాల హెచ్చరించారు.

కేసీఆర్ దీక్ష ఫలితమే ‘తెలంగాణ’



బీఆర్‌ఎస్ భవన్‌లో దీక్షలో కూర్చున్న మాజీ ఎమ్మెల్సీ ఫారూక్‌హుసేన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు

- ఫారూక్‌హుసేన్ మాజీ ఎమ్మెల్సీ
- మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుంది :బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్

నిజామాబాద్ అర్బన్ : కేసీఆర్ పట్టువదలని విక్రమార్కుడని అమరణ నిరహారదీక్ష చేసి తెలంగాణ సాధించాడని దీక్షా దివస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుసేన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చాలా మంది ఉద్యమంలో అమ్ముడుపోయారని, కేసీఆర్ మాత్రం ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించాడని అన్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాకుండా కుట్రలు చేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని, ఏడాదిలోనే కాంగ్రెస్‌పై ప్రజల వ్యతిరేకత పెరిగిందన్నారు. కేసీఆర్ చేపట్టిన దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసి రాష్ట్రం ఏర్పడడానికి పునాది అయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని వచ్చే ఎన్నికలోపు లేకుండా చేయడం నీతరం కాదని సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు.



పార్టీ కార్యాలయంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

రక్తదాన శిబిరం, ఫొటో ఎగ్జిబిషన్

బీఆర్‌ఎస్ చేపట్టిన దీక్షా దివస్‌లో భాగంగా పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అంతకు ముందు వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఘనంగా నివాళుర్పించారు. పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్ గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, బోధన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆయేషా ఫాతిమా షకీల్, మాజీ జడ్పీ చైర్మన్ విఠల్ రావు, సీనియర్ నాయకులు రాంకిషన్ రావు, రాజారాం యాదవ్, అలీం, బాజిరెడ్డి జగన్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థి మృతి


- అనారోగ్యం, ఆకస్మిక గుండె పోటు
- అనుమానాస్పద మృతిగా పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు



శివజశ్విత్‌రెడ్డి (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి శివజశ్విత్‌రెడ్డి పాఠశాల హాస్టల్‌లోనే శుక్రవారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందాడు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు 4వ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్‌కు చెందిన శివ జశ్విత్‌రెడ్డి నగరంలోని కాకతీయ స్కూల్‌లో హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. విద్యార్థి కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్నాడు. గురువారం రాత్రి వాంతులు కావడంతో హాస్టల్ సిబ్బంది మాత్రలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం వార్డెన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చారు. శివజశ్విత్‌రెడ్డి మూడవ అంతస్తు నుంచి కిందికి వచ్చి మెట్ల వద్ద పడిపోయాడు. విద్యార్థిని తండ్రి హుటాహుటిన పక్కనే ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు విద్యార్థి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విద్యార్థి అనారోగ్యం బారిన పడడంతో పాటు ఆకస్మాత్తుగా గుండె పోటు వచ్చిందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటన తెలియగానే పోలీసులు పాఠశాల ఆవరణలో బందోబస్తు నిర్వహించారు. విద్యార్థి నోటిలో నుంచి రక్తం వచ్చినట్లు ఉండడాన్ని తల్లిదండ్రులు గమనించారు.తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని విద్యార్థి తల్లి, తండ్రి భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసును లోతుగా దర్యాప్తు చేస్తామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని 4వ టౌన్ ఎస్సై పేర్కొన్నారు.

కళాశాలలో లెక్చరర్..



రుద్రూర్ : కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జువాలజీ లెక్చరర్ గోవర్ధన గిరి (49) గుండెపోటుతో మృతి చెందారు. అధ్యాపకులు తెలిపిన వివరాల ప్రకారం.. కళాశాలలో విధుల్లో ఉన్న గోవర్ధనగిరి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. సహచర అధ్యాపకులు హుటాహుటిగా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. లెక్చరర్ ఆకస్మిక మరణం అధ్యాపకుల్లో, విద్యార్థుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

బంగ్లాదేశ్‌లో దాడులను అరికట్టాలి

ఇస్కాన్ శాంతియుత నిరసన, ప్లకార్డుల ప్రదర్శన



ధర్నా చౌక్‌లో ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న ఇస్కాన్, హిందూ సంఘాల ప్రతినిధులు

సుభాష్‌నగర్: బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలు, హిందూ ధర్మ ప్రచారకుల మీద జరుగుతున్న దాడులు దుర్మార్గమైన చర్య అని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘచాలక్ డాక్టర్ కాపర్తి గురుచరణం పేర్కొన్నారు.

బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఇస్కాన్ కంఠేశ్వర్ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్‌లో శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కాపర్తి గురుచరణం మాట్లాడుతూ ప్రపంచంలో 150 పైగా దేశాల్లో ఇస్కాన్ ప్రేమ, ఆత్మీయత అనే అంశాల ఆధారంగా శ్రీకృష్ణ భక్తితత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. కోట్లాదిమందికి అన్నం పెడుతూ లెక్కలేనన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అలాంటి మానవత్వ సంస్థను మతతత్వ సంస్థగా చిత్రీకరించి, ఇస్కాన్ ప్రచారకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడమే కాకుండా, అతిక్రూరమైన రీతిలో దాడులు చేస్తున్నారని అన్నారు.

దేవాలయాలను విధ్వంసం చేసే చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరముందన్నారు. ఇస్కాన్ కేంద్ర నిర్వాహకుడు రామానంద రాయ్ ప్రభుదాస్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ సంస్థ, ప్రచారకులపై జరుగుతున్న దాడులను వెంటనే నిరోధించాలని, అక్కడి ప్రభుత్వాన్ని ఆ దిశగా ఒత్తిడి చేయాలని భారత ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. నిరసనలో వీహెచ్‌పీ, హిందూవాహిని, బజరంగ్‌దళ్, బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ, దేవాలయ పరిరక్షణ సమితి, హిందూ సంస్థల ప్రతినిధులు మాదాలు స్వామి యాదవ్, వెంకట కృష్ణ, రఘు, మారుతి, అనిల్ కదం, సాయి ప్రసాద్, పటేల్ ప్రసాద్, దాత్రిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ప్రభుత్వ పాఠశాలలు బంద్



నిజామాబాద్ అర్బన్: పాఠశాలలు, వసతి గృహాల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలపై నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐపీఎస్‌యూ నాయకులు మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ కారణంగా రాష్ట్రంలో విద్యార్థులు చనిపోయారని పేర్కొన్నారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్, నరేందర్, కుషాల్, ప్రిన్స్, రాహుల్, మనోజ్ ఉన్నారు.

అడ్డదారిలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి యత్నం



నిజామాబాద్ నాగారం: రాష్ట్రంలో మళ్లీ అడ్డదారిలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలంగాణ నిరుద్యోగ రక్షణ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మహిపాల్ యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అక్రమ పద్ధతిలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తే నిరుద్యోగులతో కలిసి పోరాటం చేస్తామన్నారు. జిల్లాల్లో వివిధ శాఖలలో దొడ్డి దారిన జరిగే నియామకాలను అడ్డుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రమోద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్‌లో గోదాం నిర్మిస్తాం



పిట్లం: పిట్లం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో త్వరలో 50వేల మెట్రిక్ టన్నుల గోదాం నిర్మిస్తామని, రైతుల సంక్షేమమే మార్కెట్ కమిటీ ముఖ్య ఉద్దేశమని మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మార్కెట్ కమిటీలో 11,000 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే గోదాములు ఉన్నాయని, మరో అదనంగా 50 వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ యార్డ్‌లో సీసీ రోడ్ల పునరుద్ధరణ చేస్తామని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తామన్నారు. గోదాముకు మరమ్మతులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, అడ్వకేట్ రామ్‌రెడ్డి, డైరెక్టర్లు షేక్ నజీర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రామారెడ్డి: బాల్యవివాహాలను సమూలంగా నిర్మూలిద్దామని రామారెడ్డి వైద్యాధికారి సురేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేశ్, వైద్య సిబ్బంది ఆశలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులతో వెంచర్‌కు వంతెన

- వెంచర్‌లో పది శాతం భూ కేటాయింపులోనూ అక్రమాలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ రాయ్‌సింగ్ (ఫైల్)



వెంచర్‌కు వెళ్లే మార్గంలో టీయూఎఫ్‌డీసీ నిధులతో నిర్మిస్తున్న వంతెన

మాక్లూర్: విలీన గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను ఓ వెంచర్‌కు వెళ్లే మార్గంలో వంతెన కోసం వినియోగించారు. ప్రభుత్వ నిధులతో వెంచర్ కోసం వంతెన నిర్మిస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అంతేగాకుండా ప్రభుత్వానికి కేటాయించాల్సిన 10 శాతం భూమిలో సైతం సదరు వెంచర్ యజమానులు అక్రమాలకు పాల్పడ్డారు. బఫర్ జోన్, దేవాదాయ భూమిని పది శాతం స్థలం కింద కేటాయించారు. మాక్లూర్ మండలంలో ఉన్న మాణిక్‌బండార్, బోర్గాం(కె) జీపీలు 2019లో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం అయ్యాయి. ఈ రెండు గ్రామ పంచాయతీల పరిధిలోని మాణిక్‌బండార్ తండా, ఈటీపీఎల్ కాలనీ, రెడ్డి క్యాంప్, దాస్‌నగర్, గాంధీనగర్ మొత్తం ఏడు గ్రామాలతో రెండో డివిజన్ ఏర్పడింది. దీంతో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోని కీలక నేతల కన్ను ఈ డివిజన్‌పై పడింది. అక్కడి రైతులను మభ్యపెట్టి, బెదిరించి ఎకరానికి రూ.కోటి పలికే భూములను రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలకే కొనుగోలు చేశారు. ఇలా మాణిక్ బండార్ శివారులో 217 ఎకరాలు పోగు చేసి అందులో 216.29 ఎకరాల్లో లే అవుట్ చేశారు. చిన్నాపూర్ గుంటను తవ్వి మొరాన్ని వెంచర్‌లోకి తరలించారు. అయితే వెంచర్‌కు నిజామాబాద్ నగరానికి మధ్యలో గల పూలాంగ్ వాగుపై గూపన్‌పల్లి సమీపంలో రెండు చోట్ల భారీ వంతెనలు నిర్మిస్తే గాని వెంచర్‌లో ప్లాట్లు అమ్ముడుపోయే పరిస్థితి లేదు. నిర్మాణానికి భారీగా డబ్బులు అవసరం కావడంతో విలీన గ్రామాల అభివృద్ధికి విడుదలైన టీయూఎఫ్‌డీసీ నిధులు రూ.10 కోట్లను దారి మళ్లించారు. ఆ డబ్బులతో రెండు వంతెనలు నిర్మించి ప్లాట్ల విక్రయాలు జరుపుకుంటున్నారు.

ప్రజలు ప్రశ్నిస్తున్నారు

గ్రామాల అభివృద్ధికి వెచ్చించాల్సిన టీయూఎఫ్‌డీసీ నిధులను వెంచర్ యజమానులు దారి మళ్లించి వాడుకుంటే కార్పొరేటర్‌గా నీవేం చేస్తున్నావంటూ డివిజన్ ప్రజలు నన్ను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. నేను నా డివిజన్ ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్న. అధికారులు స్పందించి వెంచర్ యజమానులపై చర్యలు తీసుకుని మా నిధులు మాకు ఇప్పించాలి.

– రాయ్‌సింగ్, కార్పొరేటర్, రెండో డివిజన్

దేవాదాయ శాఖ భూమి ఆక్రమణ

ఈ వెంచర్ యజమానులు దేవాదాయ శాఖ భూమినీ వదలలేదు. దేవాదాయ శాఖకు సంబంధించి సర్వే నంబర్ 499 లో 30 గుంటలు, 480లో 14 గుంటలు, 477లో 2 ఎకరాల 5 గుంటలు, 503లో 19 గుంటలు, 548లో 29 గుంటల భూమితో పాటు బచ్చల కుంట చెరువుకు సంబంధించిన భూమిని కబ్జా చేశారు. దీనిపై స్థానిక కార్పొరేటర్ రాయ్‌సింగ్ ఆధారాలతో సహా ప్రజావాణిలో మూడు సార్లు, దేవాదాయ కమిషనర్‌కు, ఇరిగేషన్ డీఈకి ఫిర్యాదు చేశారు. అయినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కేసీఆర్‌ది దొంగ దీక్ష



ధర్పల్లిలో మహిళా సమాఖ్య సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- సంక్రాంతికి రైతు భరోసా
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ధర్పల్లి: రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ చేసిన దీక్ష దొంగ దీక్ష అని, దీక్షా దివస్ పేరుతో ఇప్పుడు మరో నాటకం ఆడుతున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను మంత్రి పదవికి రాజీనామా చేసి ఆమరణ దీక్ష చేపట్టానని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్రాన్ని సోనియా గాంధీ ప్రకటించారని కోమటిరెడ్డి అన్నారు. శుక్రవారం ధర్పల్లి మండల కేంద్రం నుంచి ఇంద్రానగర్, మారియా తండాలను కలుపుతూ ధమన్నపేట వరకు రూ.8 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద స్థలం ఉన్న నిరుపేదలకు ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. సంక్రాంతి కానుకగా యాసంగి పంటలకు రైతు భరోసా కింద రూ.7,500 చొప్పున పంపిణీ చేస్తామన్నారు. కమీషన్ల కోసమే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీకి డీజిల్, పెట్రోల్‌పై నియంత్రణ లేకపోవడంతో సామాన్యులపై భారం మోపుతున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.250 కోట్లను రానున్న బడ్జెట్ సమావేశంలో కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ధర్పల్లి మండలం మహిళా సమాఖ్య సంఘాలకు రూ.350 కోట్ల రుణాల చెక్కును ఆయన అందజేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. అడిగిన వెంటనే రూరల్ నియోజకవర్గంలో రోడ్ల పనులకు నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మనోహర్ రెడ్డి, చెలిమెల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొటీన్ల నిర్మాణంలో క్రయో ఎలక్ట్రానిక్స్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న వెంకటప్రసాద్ దాండ్లి

తెయూ (డిచ్‌పల్లి): ప్రొటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రానిక్ మైక్రోస్కోపి పాత్ర ఎంతో కీలకమని అమెరికా నార్త్ కరోలిన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ సైన్సెస్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటప్రసాద్ దాండ్లి పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం 'ప్రొటీన్ల నిర్మాణ విశ్లేషణలో క్రయో ఎలక్ట్రాన్ మైక్రో స్కోపి పాత్ర' అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహించారు. ప్రొటీన్ల ఛాయాచిత్రాలను తెలుసుకోవడంతో వ్యాధి నిరోధక శక్తిని పెంచే అనేక రకాలైన డ్రగ్స్‌ను సులభంగా తయారు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ హెచ్‌వోడీ ప్రసన్నశీల, కళాశాల ప్రిన్సిపాల్ ఆరతి, వైస్ ప్రిన్సిపాల్ మాపూరపు సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు ప్రవీణ్ మామిడాల, మహేందర్ రెడ్డి, కిరణ్మయి, వాసం చంద్రశేఖర్, బోయపాటి శిరీష పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జూమ్ లింక్ ద్వారా తెయూ అనుబంధ కళాశాలల విద్యార్థులు వీక్షించారు.





అమరవీరుల స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఫారూక్ హుస్సేన్ ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, బిగాల

దీక్షా దివస్‌కు తరలివచ్చిన గులాబీ శ్రేణులు

నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి గులాబీ శ్రేణులు తరలివచ్చాయి. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జిల్లా నేతలు ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ వచ్చిందన్నారు.



దీక్షా దివస్‌కు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

తండ్రి బతికి ఉండగానే డెత్ సర్టిఫికెట్



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సెక్రెటరీ సుకన్య

బాల్కొండ: తండ్రి బతికి ఉండగానే ఓ వ్యక్తి డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి సర్టిఫికెట్ పొందడమే కాకుండా తండ్రి పేరు మీద ఉన్న ఇంటిని తన మీదకు మార్చుకొని లోన్ కూడా తీసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన ప్రసాద్‌కు కుమారుడు నాయుడు ఉన్నారు. నాయుడు పంచాయతీ కార్యదర్శి సుకన్య సంతకం ఫోర్జరీ చేసి తన తండ్రి పేరు మీద డెత్ సర్టిఫికెట్ తీసుకున్నాడు. అనంతరం తన తండ్రి పేరున ఉన్న ఇంటిని తన పేరును చేయించుకుని బ్యాంకు రుణం కూడ పొందాడు. బ్యాంకు రుణం బయటకు రావడంతో అసలు విషయం తెలిసింది. ఏడాది క్రితం ఈ ఘటన జరగ్గా కార్యదర్శి సుకన్య బదిలీపై కూడా వెళ్లింది. తాజాగా సంతకం ఫోర్జరీ చేశారని తెలుసుకుని ఆమె శుక్రవారం మెండోరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఎమ్మెల్యేపై విమర్శలు తగవు

పిట్లం(జుక్కల్): మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్‌పై చౌకబారు విమర్శలు మానుకోవాలని పిట్లం మండల సీనియర్ నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే అవినీతికి పాల్పడుతున్నాడని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం లేదని హన్మంత్ షిండే మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, కృష్ణారెడ్డి, హన్మాండ్లు, మల్లికార్జున్, జొన్న మోహన్ రెడ్డి, షేక్ నజీర్, శివ, ఎరుకల అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ మహిళా హ్యాండ్ బాల్ క్రీడలు నిర్వహించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలు జీవితంలో ఒక భాగమన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడకారులు మార్చ్ పాస్ట్ నిర్వహించి క్రీడా పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పవన్, జిల్లా అధ్యక్షుడు గంగమోహన్‌చక్రు, ప్రధాన కార్యదర్శి పింజా సురేందర్, జిల్లా పేట సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, సదమస్తుల రమన రాజేష్, శ్యామ్, నాగేస్, సునీత, గంగాదర్, రాజేందర్ పాల్గొన్నారు.

డిసెంబర్ 1 నుంచి ఓపెన్ తరగతులు

నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్, పీజీ తరగతులు డిసెంబర్ ఒకటి నుంచి ప్రారంభం అవుతాయని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7382929612 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అటవీ సిబ్బందికి సన్మానం



కామారెడ్డి అర్బన్: ఉద్యోగ విరమణ పొందనున్న ఇద్దరు అటవీ శాఖ సిబ్బందిని సిరిసిల్ల రాజన్న జోనల్ చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ అభినందించారు. సెక్షన్ అధికారి ఎ శంకర్, బీట్ అధికారి ఎం అంజయ్యను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నిఖిత, డివిజనల్ అటవీఅధికారి పి రామకృష్ణ, రేంజ్ అధికారి రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బోధన్‌టౌన్: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యాన్ని పెంచుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం బీసీ సంక్షేమ వసతి గృహాల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి ఆమె బహుమతులు అందజేశారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి స్రవంతి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు నర్సయ్య, గంగాధర్, ఫిజికల్ డైరెక్టర్ సంగీత రావ్ పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

క్రైం కార్నర్

మూడు స్కూల్ బస్సుల సీజ్



నందిపేట్(ఆర్మూర్): మండలంలో అనుమతులు లేకుండా, ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సులపై ఆర్మూర్ ఆర్టీఏ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో టాక్స్ లేకుండా తిరుగుతున్న మూడు పాఠశాలకు చెందిన బస్సులను ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి చేసి సీజ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాలకు ఫిట్‌నెస్ బస్సులను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్ కేసులో కోర్టు ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ శుక్రవారం తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి ట్రాఫిక్ సీఐ ప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ అహ్మద్ మొయిద్దీన్ తొమ్మిది మందికి రూ.25,500 జరిమానా విధించినట్లు చెప్పారు. ఎల్లమ్మ గుట్టకు చెందిన దిడి రాజుకు రెండు రోజులు, దారుగల్లీకి చెందిన హుస్సేన్ బిన్ సలీంకు మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

స్తంభాన్ని ఢీకొన్న లారీ



బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ శివారులో శెట్‌పల్లి వెళ్లే రోడ్డు పక్కన గల విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం ఉదయం ఎరువుల లారీ ఢీకొంది. డ్రైవర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగిందని రైతులు తెలిపారు. లారీ యజమాని చేతనే స్తంభాన్ని పునరుద్ధరించినట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

కనుల పండువగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



రథంపై ఉత్సవ మూర్తులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని నవనాథ సిద్ధేశ్వర స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రథోత్సవం(గిరి ప్రదక్షిణ) ఘనంగా నిర్వహించారు. నవనాథ సిద్ధేశ్వర, అన్నపూర్ణ సీతారామ, అయ్యప్ప విగ్రహాలను రథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక త్రయోదశి రోజు స్వామివారి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. సిద్ధుల గుట్ట నందీశ్వర మహరాజ్ పూజలు చేసిన అనంతరం ఊరేగింపు ప్రారంభించారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కాలనీల్లో మహిళలు పెద్దఎత్తున స్వామి వారికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి సుమన్, పీసీ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

